సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా


శుక్రవారం । 14 । మార్చి । 2025



టన్ను చీనీ రూ.25,630
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,630, కనిష్టంగా రూ.2,800 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.8
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా 5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

కోడింగ్‌లో పొరబాట్లకు తావివ్వొద్దు

- పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల కోడింగ్‌లో ఏ చిన్న పొరబాటుకు తావివ్వొద్దని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ సూచించారు. గురువారం అనంతపురంలోని సైన్స్ కేంద్రంలో రాయలసీమ జిల్లాల్లోని కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ శామ్యూల్ మాట్లాడుతూ కోడింగ్ ప్రక్రియ అత్యంత కీలకమైందన్నారు. ఏ ఒక్క విద్యార్థికీ అన్యాయం జరగకూడదన్నారు. చదివేవాడికి, చదవలేనివాడికి ఒకే విధంగా మార్కులు వచ్చే పొరబాట్లు చేయొద్దన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్లు కీలకం అన్నారు. రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ పరీక్షలకు కూడా ఇదే విధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో అనంతపురం, అన్నమయ్య, కర్నూలు, కడప డీఈఓలు, 8 జిల్లాల నుంచి ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్లు, 130 మంది కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు హాజరయ్యారు.

476 మంది విద్యార్థుల గైర్హాజరు


హిందూపురంలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్జేడీ రవీంద్ర

పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–1 పరీక్షలకు 476 మంది గైర్హాజరయ్యారు. ఆర్జేడీ రవీంద్ర ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డితో కలిసి హిందూపురంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 11,766 మంది జనరల్ విద్యార్థులకు గాను 11,388 మంది విద్యార్థులు హాజరైనట్లు రఘునాథరెడ్డి తెలిపారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1156 మంది విద్యార్థులకుగాను 1068 మంది హాజరైనట్లు చెప్పారు. జిల్లా స్పెషలాఫీసర్ చెన్నకేశవప్రసాద్, కమిటీ సభ్యులు సురేష్, రామరాజు, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పరీక్షలను పర్యవేక్షించారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) మధుసూధన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ జరగనున్న పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఒరిజినల్ హాల్ టికెట్ కండెక్టర్‌కు చూపిస్తే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ అవకాశం అన్ని పల్లె వెలుగుల (ఆర్డినరీ) బస్సుల్లో ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు.

హోలీ పండుగ ప్రశాంతంగా జరుపుకోండి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న ప్రజలకు సూచించారు. గురువారం ఆమె జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ నేపథ్యంలో జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీల్లో రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు డ్రోన్లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఇతర వ్యక్తులకు భంగం కలిగించేలా ప్రవర్తించకూడదన్నారు. ప్రధానంగా మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్లరాదని సూచించారు. వేడుకల్లో పర్యావరణ హితమైన రంగులను వాడాలని కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కదిరి అర్బన్: మండల పరిధిలోని దిగువపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఓబులేసును గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప సస్పెండ్ చేశారు. మనబడి – మన భవిష్యత్తుకు కేటాయించిన నిధులు దుర్వినియోగం చేసినట్లు తేలడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

రైతులకు చింత


శుద్ధి చేయడానికి కుప్పగా వేసిన చింతకాయలు

జిల్లాలోనే చింతపండు ఉత్పత్తికి మడకశిర నియోజకవర్గం ప్రసిద్ధి. ఇక్కడ ప్రతి గ్రామంలోనూ చింతచెట్లు విస్తరించి ఉన్నాయి. అయితే ఈసారి దిగుబడి సరిగా లేకపోవడంతో పాటు కూలీల ఖర్చు పెరగడంతో చింత రైతులు నష్టపోతున్నారు. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతోనూ ఇబ్బందులు తప్పడం లేదు.



- తగ్గిన చింతపండు దిగుబడి
- ధర ఆశాజనకంగా ఉన్నా.. గిట్టుబాటుకాని వైనం
- రెండింతలు పెరిగిన కూలీల ఖర్చు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

మడకశిర: నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో దాదాపు 42 వేల మంది రైతులకు చింత చెట్లు ఉన్నాయి. 2 లక్షల వరకు చింత చెట్లు విస్తరించాయి. ఏడాది కొకసారి వచ్చే చింత ఫలసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఊరట చెందేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

రూ.6 కోట్ల నుంచి రూ.2 కోట్లకు..

నియోజకవర్గంలో గరిష్టంగా రూ.6 కోట్ల విలువ చేసే చింతపండు ఉత్పత్తి జరగాల్సి ఉంది. అయితే ఈ ఉత్పత్తి విలువ ప్రతి ఏడాది క్రమేణా తగ్గిపోతోంది. గత ఏడాది కూడా చింతపండు ఉత్పత్తి విలువ మడకశిర నియోజకవర్గంలో రూ.3 కోట్లకు చేరుకోలేదు. ఈ ఏడాది కూడా చింతపండు ఉత్పత్తి భారీగా పడిపోయింది. చింతపండు దిగుబడి నామమాత్రంగానే ఉంది. రూ.2 కోట్లు కూడా ఉత్పత్తి విలువ దాటే పరిస్థితి లేకుండా పోయింది.

ధర బాగున్నా...

ఈఏడాది చింతపండు ధర ఆశాజనకంగానే ఉంది. ప్రారంభం నుంచి చింతపండు ధరలు నిలకడగానే ఉన్నాయి. ఈ ఏడాది మొదటి రకం (కరిపులి) చింతపండు గరిష్ట ధర క్వింటాలు రూ.40 వేల వరకూ పలికింది. అలాగే కనిష్ట ధర రూ.8 వేల వరకూ పలికింది. రెండో రకం (ప్లవర్) చింతపండు ధర గరిష్టంగా రూ.14 వేల వరకూ పలికింది. కనిష్ట ధర రూ.5 వేలకు దాకా పలికింది. అయినా రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాలేదు. ధర ఆశాజనకంగా ఉన్నా కూడా చింతపండు దిగుబడి 50 శాతం తగ్గడంతో రైతులకు నిరాశే మిగిలింది.

పెరిగిన ఉత్పత్తి వ్యయం..

చింతపండు ఉత్పత్తి వ్యయం కూడా పెరగడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. చింతకాయలను చెట్టు నుంచి కోయడానికి గతంలో ఒక మగ కూలీకి రోజుకు రూ.300 కూలీ ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ కూలీ రూ.800కు పెరిగింది. అదే విధంగా చెట్టు నుంచి కోసిన చింత కాయలు నేలపై పడతాయి. ఆ కాయలను ఏరడానికి గతంలో ఒక ఆడ కూలీకి రోజుకు రూ.100 చెల్లించే వారు. ప్రస్తుతం అది రూ.400 అయింది. చింతకాయల నుంచి చింతపండును శుద్ధి చేయడానికి రోజుకు ఓ ఆడ కూలీకి గతంలో రూ.150 చెల్లించే వారు ప్రస్తుతం రూ.400 పెరిగింది. గతానికి భిన్నంగా కూలీలకు భోజన సౌకర్యం కూడా కల్పించాల్సి వస్తోంది. కూలీల ఖర్చు పెరగడం కూడా చింతపండు రైతులకు భారంగా మారింది.


చింతపండును శుద్ధి చేస్తున్న కూలీలు

చింతచెట్లను తొలగిస్తున్న రైతులు..

నియోజకవర్గంలో కొందరు రైతులు చింతచెట్లను ఇప్పటికే తొలగించారు. ఆశించిన స్థాయిలో రైతులకు ఆదాయం రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. చింతకట్టెలను ఇటుక బట్టీల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీంతో చింత కట్టెలకు అధిక డిమాండ్ ఉంది. చింతచెట్లను తొలగించడానికి ఆదాయం తగ్గడం ఒక కారణమైతే....చింతచెట్లు ఉన్న భూమి వ్యవసాయం చేసుకోవడానికి పనికిరాదు. దీంతో చాలా మంది రైతులు వ్యవసాయ యోగ్యమైన భూమిలో ఉన్న చింతచెట్లను తొలగించి వ్యవసాయం చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అమరాపురం, గుడిబండ, మడకశిర తదితర మండలాల్లో చింత చెట్లను తొలగించారు. ఇటుక బట్టీల నిర్వాహకులు చింతచెట్లను గ్రామాలకే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

మార్కెట్ సౌకర్యం కరువు..

జిల్లాలో మడకశిర నియోజకవర్గంలోనే 90 శాతం చింతపండును రైతులు పండిస్తున్నారు. మడకశిరకు ఆనుకుని ఉన్న సరిహద్దులోని కర్ణాటకకు చెందిన పావగడ, శిర, హిరియూర్, మధుగిరి, చళ్లకెర నియోజకవర్గాల్లో కూడా చింతపండు ఉత్పత్తి ఎక్కువగా ఉంది. అయినా మడకశిరలో చింతపండు మార్కెట్ లేదు. మడకశిర ప్రాంతం రైతులు చింతపండును హిందూపురం, శిర మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. మడకశిరలో చింతపండు మార్కెట్ ఏర్పాటు చేయకపోవడం కూడా రైతులకు ఇబ్బందికరంగా మారింది. చింతపండు ఉత్పత్తిపై రైతులకు ఆసక్తి తగ్గేందుకు ఇది కూడా ఓ కారణంగా మారింది.

దిగుబడి పూర్తిగా తగ్గింది



ఈఏడాది చింతపండు దిగుబడి పూర్తిగా తగ్గింది. దీంతో పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి. ప్రతి ఏడాది చింతపండు దిగుబడి తగ్గతూనే ఉంది. దిగుబడి తగ్గడం వలన గిట్టుబాటు కావడం లేదు. మార్కెట్‌లో దళారుల బెడదతో కూడా నష్టపోతున్నాం. ప్రభుత్వం చింతపండు రైతులను దళారుల బెడద నుంచి కాపాడాలి. ముఖ్యంగా స్థానికంగా రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. – కెంచప్ప, అమరాపురం

ధర బాగున్నా ఉపయోగం లేదు



చింతపండు ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. అయినా ప్రయోజనం లేదు. కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రస్తుతం 50 శాతం చింతపండు ఉత్పత్తి వ్యయం పెరిగింది. దీంతో ధరలు ఉన్నా గిట్టుబాటు కావడం లేదు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడం ఇబ్బందిగా మారింది. చింతపండును ఇతర ప్రాంతాలకు తరలించాలంటే అదనపు భారం భరించాల్సిందే. – తిప్పేస్వామి, గుడిబండ

రైతుల గోడు పట్టదా?



చింతపండు రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మడకశిరలోనే మార్కెట్ సౌకర్యం కల్పించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించడానికి చొరవ తీసుకోవాలి. చింతపండు రైతులు నష్టపోతే నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. – హనుమంతరాయప్ప, అగళి

మము కరుణించు సాయీ ..


బాలికల నృత్య ప్రదర్శన


'భరత్ మిలాప్' నాటికను ప్రదర్శిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: హోలీ పర్వదిన వేడుకల్లో భాగంగా బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల భక్తులు నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సత్యసాయి భక్తులను అలరించాయి. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన ఇరు రాష్ట్రాల భక్తులు గురువారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. 'భరత్ మిలాప్' పేరుతో రామాయణంలో రాముడి వనవాస సమయంలో రాముడిపై భక్తిభావన, వాత్సల్యాన్ని ప్రదర్శిస్తూ వనవాసం వెళ్లకూడదు అని భరతుడు వేడుకున్న అంశం ఇతివృత్తంగా ప్రదర్శించిన నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఖాద్రీశుడి దర్శనం.. భక్త పారవశ్యం


హనుమంత వాహనంపై లక్ష్మీ నారసింహుడు

- హనుమద్వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు
- భక్తులతో కిటకిట లాడిన ఆలయం


భక్తులతో కిటకిటలాడుతున్న కదిరి లక్ష్మీ నారసింహుడి క్షేత్రం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గురువారం ఖాద్రీశుడు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఉత్సవాలకు ఉభయదారులుగా జొన్నా వీరయ్య, జొన్నా వీరశేషయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖాద్రీ లక్ష్మీనారసింహుడు శుక్రవారం (నేడు) గరుడ వాహనంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమివ్వనున్నారు. నృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే భక్తులంతా బ్రహ్మగరుడ సేవ రోజునే 'కదిరి పున్నమి' పేరుతో పండుగ జరుపుకుంటారు.


ఆలయం వద్ద ప్రత్యేక అలంకరణ


నృత్యాన్ని ప్రదర్శించిన చిన్నారులు

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహణపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులతో పరీక్షలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. జిల్లాలో 23,730 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అందులో 22,295 మంది రెగ్యులర్, 1435 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 104 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 780 మంది 11 సెంటర్లలో పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఒక్కో విడతలో 1186 మంది చొప్పున రెండు విడతలకు 2,372 మంది ఇన్విజిలేటర్లను నియమిస్తున్నట్లు వివరించారు. 6 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, డీఈఓ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.


మొల్ల మాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

మొల్ల మాంబ జీవితం ఆదర్శం

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల మాంబ జయంతిని గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా కలెక్టర్ టీఎస్ చేతన్ మొల్ల మాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొల్ల మాంబ జీవితం ఆదర్శనీయమన్నారు. 16వ శతాబ్దానికి చెందిన కవయిత్రి మొల్ల మాంబ రామాయణాన్ని సంస్కృతంలో నుంచి తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రిగా గుర్తించబడ్డారన్నారు. జాతికి మొల్ల మాంబ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమె జయంతిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీళ్లివ్వాలని మహిళల ధర్నా


ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిబండ: జిల్లాలో తాగునీటి సమస్యలపై రోజుకో ప్రాంతంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం మండల పరిధిలోని సీసీ గిరి గ్రామంలోని ఎస్సీ కాలనీలోనీ మహిళలు రోడ్డెక్కారు. పీసీ గిరి పంచాయతీ సీసీ గిరి గ్రామం దళితకాలనీలోనీ ప్రజలకు వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇందులో భాగంగానే గ్రామస్తులు ఖాళీ బిందెలతో కర్ణాటక రాష్ట్రం శిరాకు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. నీటి సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నమించినా స్పందన కరువైందని మహిళలు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ డీఎల్ యంజారేగౌడు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామ ప్రజలు, మహిళలతో మాట్లాడారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు.

క్లుప్తంగా

ఆదిశక్తికి ప్రతిరూపమే మహిళ

- ఎస్పీ రత్న



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.రత్న

హిందూపురం: ఆదిశక్తికి ప్రతిరూపమే మహిళ అని ఎస్పీ రత్న పేర్కొన్నారు. హిందూపురం డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో తూమకుంట సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్పీతోపాటు హిందూపురం జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, సీడీపీఓ శాంతి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం త్వరలో శక్తి టీఎం ఏర్పాటు చేయబోతోందన్నారు. శక్తి యాప్ కూడా ఏర్పాటు చేశామని ఆన్‌లైన్ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఏ ఆపద వచ్చినా సెల్‌ఫోన్ మూడుసార్లు ఊపినా లేదా ఎస్ఓఎస్ బటన్ నొక్కినా వెంటనే రెస్క్యూ టీం ఘటనస్థలికి చేరుకుని రక్షిస్తుందన్నారు. హిందూపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను దేన్నయినా ధైర్యంగా ఎదుర్కొనేలా పెంచాలన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. డాక్టర్లు జీవన, షమ్మిలా, సీఐలు జనార్దన్, ఆంజనేయులు, కరీం, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రమ్మీ.. జీవితాలు డమ్మీ!

- పట్టణానికి చెందిన ఓ యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి నుంచే వర్క్ ఫ్రంహోమ్ చేస్తున్నాడు. తన ల్యాప్‌టాప్ నుంచి రమ్మీ ఆడటం మొదలెట్టి .. వ్యసనంగా మలుచుకొని జీతం అంతా తగలేస్తూ.. చివరికి స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకోనున్నట్లు సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డ్ చేసి అది వారి కుటుంబీకులకు తెలిసేలా చేయడంతో చివరకు ఆ కుటుంబీకులు అప్పులు కట్టాల్సి వచ్చింది.
- ముద్దిరెడ్డిపల్లికి చెందిన చేనేత వ్యాపారి ఒకరు తరచూ ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడి చివరకు పట్టుచీరలు అమ్మిన మొత్తాన్నే గాక పలువురి నుంచి అప్పులు చేసి మరీ ఆడాడు. చివరకు అప్పులు తీర్చలేక, బ్యాంకుల్లో తీసుకున్న రుణం కట్టలేకపోయాడు. తాజాగా తాకట్టు పెట్టిన ఇళ్ల అమ్మకానికి రావడంతో చేసేది లేక బంధువుల వద్ద కాళ్లావేళ్లా పడుతున్నాడు.
- హిందూపురానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ పేకాటకు అలవాటు పడి జీవితాన్నే నాశనం చేసుకున్నాడు. ఉదయం నుంచి రాత్రి వరకు రమ్మీ ఆడటం వచ్చిన మొత్తాన్ని మళ్లీ షేర్స్‌కు మళ్లించడం.. అక్కడ కొంత కాలం కొంత వచ్చినట్లు కనపడినా తరువాత నష్టపోయాడు. చివరకు పట్టణంలో కట్టిన సొంత ఇంటిని సైతం అమ్ముకోవాల్సి వచ్చింది. వీరే కాదు.. చాలామంది ఆన్‌లైన్ పేకాటకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

- సరదాగా మొదలై.. సర్వస్వం కోల్పోయి..
- విస్తరిస్తున్న ఆన్‌లైన్ పేకాట
- పెడదారి పడుతున్న యువత



హిందూపురం అర్బన్: సప్త వ్యసనాల్లో ఒకటి చతుర్ముఖ పారాయణం. అదేనండి పేకాట. ఒకప్పుడు సరదా కోసం మొదలైన పేకాట ఇప్పుడు వ్యసనంగా మారిపోయింది. ఈ ఆట మత్తులో జేబులు ఖాళీ చేసుకోవడమే కాదు జీవితాలను గుల్ల చేసుకుంటున్నారు. హిందూపురం కర్ణాటకకు ఆనుకుని ఉండటంతో ఆన్‌లైన్ గేమింగ్ సంస్కృతి శరవేగంగా బెంగళూరు నుంచి పట్టణాలకు అక్కడి నుంచి పల్లెలకు విస్తరించింది. సెల్‌లో స్మార్ట్‌ఫోన్‌తో కొంత సమయం దొరికితే చాలు యువత, విద్యార్థులు, ఉద్యోగులు సైతం ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారు. ఈ వ్యసన బారిన పడిన వారు తమ పనులు వదిలేసి గంటల తరబడి ఈ ఆటకే సమయం కేటాయిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో యువకులు ఆన్‌లైన్ పేరిట పేకాట ఆడుతూ రూ.లక్షలకు లక్షలు పోగొట్టుకుంటున్నారు. అప్పుల పాలై చివరకు వాటిని తీర్చేందుకు అడ్డదారులు తొక్కడం.. తరువాత అప్పులు తడిసి మోపెడు అవడంతో ఆత్మహత్యల వరకూ దారి తీస్తున్నాయి.

ఆన్‌లైన్ రమ్మీ..

మొబైల్, ల్యాప్‌టాప్‌ల్లో చిన్న తెరపై ఆడే 13 ముక్కల పేకాట వ్యసనం ఎంతో మంది యువత బతుకులను నాశనం చేస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ అయి అకౌంట్ క్రియేట్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో గేమ్‌లను ఆడేందుకు కొంత మొత్తాన్ని కస్టమర్లకు కంపెనీలు ఉచితంగా ఇవ్వడం ఆ డబ్బుతో ఆడటం .. ఆ తర్వాత ఆ ఆటకు బానిసలుగా మారుతున్నారు. ఆ వైపు ఆడుతున్నది ఎవరో తెలియదు.. కానీ ఈ మాయా జూదంలో ఇటు వైపు ఆటగాళ్ల బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. మొదట్లో ఒకటి రెండు ఆటలు గెలవడం.. తరువాత ఓటమి తప్ప గెలుపే ఉండదు.

ఈజీ మనీ కోసం..

తక్కువ సమయంలో లక్షాధికారులు అవ్వాలన్న దురాలోచన చాలా మంది జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఈజీ మనీకోసం ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడుతున్నారు. అంతేగాక ఆన్‌లైన్‌లో వివిధ పేర్లతో ఉన్న ఆటకు ప్రధానంగా యువత మాయలో పడి గిలగిల లాడుతున్నారు. చేతిలో ఉన్నది పోగొట్టుకొని ఇతరుల వద్ద అప్పు చేసి బంగారం, బైకులు తాకట్టు పెట్టి జూదంలో పెడుతున్నారు. ఆన్‌లైన్ జూదాన్ని అదుపులోకి ఎలా అదుపులోకి తీసుకురావాలన్నది ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఆన్‌లైన్ గేమ్‌లపై అవగాహన లేక వాటి మోజులో పడి నాశనమవుతున్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

పట్టణ ప్రాంతాలు, పల్లెలు అన్న తేడా లేని యువత సెల్‌ఫోన్ల ద్వారా బెట్టింగులకు పాల్పడటం ఎక్కువైంది. ప్రధానంగా కళాశాలలకు వెళ్లే వారిలో ఈ అలవాటు ఎక్కువగా కనిపిస్తోంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలను నిశితంగా గమనిస్తూ ఉండాలి. – బాలాజీ, హిందూపురం

ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి



ఆన్‌లైన్ గేమ్‌ల బారిన పడి ఎంతోమంది యువత తమ విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలి. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. సరదాలకు పోయి తర్వాత వ్యసనంగా మారుతోంది. యువత చేజేతులారా తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారంలో నెట్టుకుంటున్నారు. – కెవి. మహేష్, డీఎస్పీ, హిందూపురం

రైలు కిందపడి లారీ క్లీనర్ ఆత్మహత్య



షెక్షావలి(ఫైల్)

ధర్మవరం అర్బన్: అనారోగ్యంతో రైలు కిందపడి లారీ క్లీనర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో జరిగింది. హిందూపురం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో నివసిస్తున్న అబ్దుల్ ఖాదర్‌వలి కుమారుడు షెక్షావలి(24) లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. నాలుగేళ్లుగా అల్సర్‌తోపాటు గడ్డలు ఉండటంతో తీవ్రనొప్పితో బాధపడుతుండేవాడు. తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. నొప్పి ఎక్కువగా ఉండటంతో వారం రోజులుగా తాను రైలు కింద పడి చనిపోతానంటూ తల్లిదండ్రులతో చెబుతున్నాడు. ఈక్రమంలో గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాందేడ్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ సమాచారం మేరకు హిందూపురం జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి: శాసనకోటలో కేశవయ్య(30) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాలు.. సోమందేపల్లి మండలం నడింపల్లికి చెందిన కేశవయ్యకు శాసనకోట గ్రామానికి చెందిన స్నుతితో 2021లో వివాహమైంది. వీరికి విక్రాంత్ అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వృత్తి రీత్యా కేశవయ్య బెంగళూరులో ఉంటున్నాడు. అయితే భార్య స్నుతి, ఆమె తల్లి పాపులమ్మ, బావమరిది సురేష్ తరచూ కేశవయ్యతో గొడవ పడేవారు. శాసనకోటలో కాపురముండాలని, సంపాదించినదంతా తమకే ఇవ్వాలని వేధించేవారు. ఈక్రమంలో గత బుధవారం అతడు శాసనకోటకు వచ్చాడు. కుటుంబ సభ్యులంతా లేపాక్షి మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు స్నుతి, పాపులమ్మ, సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బేల్దారి బలవన్మరణం



మృతుడు నంజుండ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలోని తిమ్మాపురంలో బేల్దారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అందించిన సమాచారం.. గ్రామానికి చెందిన నంజుండ (33) బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే తన భార్య సీపీఎం నేత రమేష్‌తో సన్నిహితంగా ఉంటోందని మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు ముత్యాలు ఫిర్యాదు మేరకు నాగమణితోపాటు రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

పట్టపగలే ఇంట్లో చోరీ

తాడిపత్రి: సజ్జలదిన్నె గ్రామంలో చాంద్‌బాషా అనే వ్యక్తి ఇంటిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చాంద్‌బాషా, బీబీ దంపతులు సజ్జలదిన్నె పారిశ్రామిక వాడలోని ఓ బండల పాలిష్ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. ఉదయం వారు పనులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలు, జత వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారులకు తీవ్రగాయాలు





గాయాల పాలైన గోకుల్, ప్రార్థన

మడకశిర: పట్టణ సమీపాన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు తీవ్ర గాయాల పాలయ్యారు. రొళ్ల మండలం కొడగార్లగుట్ట గ్రామానికి చెందిన సన్నలింగప్ప తన కుమార్తె ప్రార్థన, కుమారుడు గోకుల్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బైక్‌పై మడకశిరకు బయలుదేరాడు. ఈ క్రమంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల సమీపాన జాతీయ రహదారి పక్కన చెరుకు రసం తాగడానికి బైక్‌ను రోడ్డు పక్కన ఆపి ఇద్దరినీ అందులోనే కూర్చోబెట్టి చెరుకు రసం తేవడానికి వెళ్లాడు. ఈ సందర్భంలో మధుగిరి నుంచి పావగడ వైపు వెళుతున్న కేఎస్ ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఘటనలో ప్రార్థన కుడి కాలు పూర్తిగా దెబ్బతింది. గోకుల్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హిందూపురం తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు తిప్పిబాయి

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి తండాలో విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు, గ్రామస్తుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన తిప్పిబాయి (49) గురువారం ఉదయం ఇంటి వద్ద తాగునీటి సంపునకు అమర్చిన విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందుకు యత్నించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీరాములు ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కదిరి కొండపై శ్రీవారి పాద చిహ్నాలు



కదిరి కొండ



బ్రహ్మోత్సవాల ప్రత్యేకం



నారసింహుని పాద ముద్రికలు

కదిరి: స్వామి వారి పాదాలు తాకితే ఈ జన్మకు ఇక చాలని ఏ భక్తుడైనా కోరుకుంటాడు. ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాలు తాకాలంటే కదిరి కొండకు వెళ్లాల్సిందే. శ్రీవారి పాద చిహ్నలను తాకిన వారు పాప విముక్తులవుతారని భక్తుల నమ్మకం. అందుకే వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న భక్తాదులు కదిరి కొండపై ఉన్న నృసింహుని పాద ముద్రికలను దర్శించుకుంటున్నారు. నిర్మలమైన మనస్సుతో స్వామివారి పాదాలను తాకి, మనసులో ఆరాధిస్తే ఈతి బాధల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

చెరిగిపోని పాదముద్రలు..

హిరణ్య కశ్యపుడిని సంహరించేందుకు శ్రీ మహా విష్ణువు సగం మనిషి, సగం సింహం రూపంలో అంటే నరసింహావతారమెత్తారు. ఉగ్రరూపంతో స్తంభం నుంచి ఆవిర్భవించారు. హిరణ్య కశ్యపుడి సంహారం అనంతరం ఉగ్రరూపంలో ఉన్న నారసింహుని ఆ రూపాన్ని ఉపసంహరించుకోవాలని ప్రహ్లాదుడు, దేవ దేవతలతో పాటు శ్రీదేవి, భూదేవిలు కదిరి కొండపై నుంచి ప్రార్థించారు. నృసింహుని మెప్పించేందుకు అక్కడి నుంచి వారంతా స్తోత్రం చేయడంతో స్వామి వారు అక్కడ దర్శనమిచ్చారని బ్రహ్మాండ పురాణం చెబుతోంది. అందుకే ఆ పర్వతానికి 'స్తోత్రాద్రి' అనే పేరు వచ్చిందని అందులో పేర్కొన్నారు. ఆ సమయంలో స్వామి వారు అక్కడ మోపిన పాదాల గుర్తులు ఇప్పటికీ చెరిగిపోలేదు. భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాయి.

రూ.46 లక్షల విత్తనాలకు స్టాప్‌సేల్స్

- వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏఓ జే.శశికళ
- ఆత్మహత్యకు యత్నించిన రైతుకు పరామర్శ



ప్రభుత్వాసుపత్రిలో రైతు మురళిని పరామర్శిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ రవి



కళింగర పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ అమరేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: నాసిరకం కళింగర విత్తనాల వల్ల నష్టం వాటిల్లిందని బుధవారం స్థానిక శ్రావణి సీడ్స్ దుకాణం ఎదుట పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి రైతు మురళీ ఆరోగ్యం నిలకడగా ఉంది. గురువారం వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏఓ జే.శశికళ స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం, పంట పెట్టుబడికి రూ.6.90 లక్షల వరకు ఖర్చు చేసినట్లు రైతు తెలిపారన్నారు. అందుకు సంబంధించి బిల్లులు సేకరించామన్నారు. బీఏఎస్ఎఫ్ కంపెనీకి చెందిన కళింగర విత్తనాలకు సంబంధించి వివిధ దుకాణాల్లో సోదాలు నిర్వహించి రూ.20 లక్షల విలువ చేసే విత్తనాలకు అమ్మకాల నిలిపివేత (స్టాప్‌సేల్స్) ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అలాగే సాయంత్రం శ్రావణి సీడ్స్ దుకాణంను తెరిపించి తనిఖీ చేశామన్నారు. స్టాకు, సేల్స్ మధ్య వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. బీఏఎస్ఎఫ్‌తో పాటు మరికొన్ని కంపెనీలకు చెందిన రూ.26 లక్షలు విలువ చేసే కళింగర, కర్బూజా విత్తనాలకు స్టాప్ సేల్స్ ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. మొత్తంగా రూ.46 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకాలు నిలిపివేశామన్నారు. కమిషనరేట్, జేడీఏ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ, నాసిరకకం, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై నిఘా మరింత పెంచుతామని తెలిపారు.

కళింగర పంట పరిశీలన

బత్తలపల్లి: నకిలీ విత్తనాలతో మోసపోయి ఆత్మహత్యకు యత్నించిన గుజ్జల మురళి సాగు చేసిన కళింగర పంటను హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు డి.చెర్లోపల్లిలో పంట సాగు, పెట్టుబడి వివరాలను సర్పంచు గుజ్జల రమాదేవి, ఇతర రైతులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మురళి 3.74 ఎకరాల్లో కళింగర పంట 'మాక్స్' రకంను నవంబర్ 27న నాటారన్నారు. పంట కాల పరిమితి 70–75 రోజులు దాటినా కాయ లోపల తెలుపు రంగులో ఉండడంతో వ్యాపారస్తులు ఎవ్వరూ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. నకిలీ విత్తనాలు అంటగట్టడం వల్లనే ఇలా జరిగిందని, తద్వారా పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతు ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

వినూత్నంగా వివాహ వేడుక

- అతిథులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న వధూవరులు

పావగడ: తాలూకాలోని భీమనకుంటె గ్రామం సముదాయ భవనంలో తాండ్ర కల్పన, వి గోకుల్ వివాహ వేడుక వినూత్నంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులు వివాహానికి వచ్చిన సుమారు 500 మంది అతిథులకు జామ, దానిమ్మ, నేరేడు, శ్రీగంధం తదితర మొక్కలను అందించి ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ వేడుకల్లో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయ మూర్తి హెచ్ఎల్ దత్తు, భార్య గాయత్రి, విశ్రాంత విశేష జిల్లా కలెక్టర్ దొడ్డహళ్లి రామాంజనేయులు, భార్య శారద తదితర ప్రముఖులు మొక్కలను పంపిణీ చేసిన నూతన వధూవరులను ఆశీర్వదించారు. మొక్కలపై వారికి ఉన్న ఎనలేని మక్కువను ప్రశంసించారు.

స్వచ్ఛ మార్గంలో పయనిద్దాం

- కలెక్టర్ టీఎస్ చేతన్



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రభుత్వ ఆశయాల మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా మార్గంలో పయనిద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. మూడో శనివారం నిర్వహించాల్సిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆస్పత్రులు, పారిశ్రామిక యూనిట్లు, పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతా పరిమళాలు వెల్లివిరియాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. డీపీఓ సమత, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలి

స్వర్ణాంధ్ర సాధనలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సీఎస్ఆర్ నిధుల వినియోగంపై వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీపీఓ విజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, డీపీఓ సమత, పలు కంపెనీలు ప్రతినిధులు పాల్గొన్నారు.